నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, బుధవారం 3 జూలై 2024 | VIKARABAD

ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

## సేంద్రియ పద్ధతులే మేలు

### వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 2 : సాగులో విప్లవాత్మక మార్పులు అవసరమని అందుకనుగుణంగా వనరులు కల్పించడంలో భాగమే ఈ-ఫర్టిలైజర్ పరీక్ష ల్యాబ్‌అని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నా రు. మంగళ వారం రూ.7.90 కోట్లతో నూతనంగా నిర్మించిన మట్టి, విత్తనాలు, ఫర్టిలైజర్ పరీక్ష ల్యాబ్‌ల నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, రంగారెడ్డి కలెక్టర్ శశాంకతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఇప్పటికీ అక్కడక్కడ మూస పద్ధతిలో సాగు చేసి నష్టాల బారిన పడుతున్నారని.. వారు సేంద్రియ పద్ధతులను అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ సేంద్రియ పద్ధతులను వాడి అధిక దిగుబడిని పొందాలన్నారు. రైతులు మట్టి, భూసార పరీక్షలు చేసుకునేందుకు ఈ ల్యాబ్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

రైతులతో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

## అన్నం పెట్టే రైతు ఆనందంగా ఉండాలి

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్**

**రైతుల బాగు కోసమే గ్రామాల పర్యటన**

**మండలాన్ని వెజిటెబుల్ జోన్‌గా ప్రకటించాలి**

నవాబుపేట, జూలై 2 : అన్నం పెట్టే రైతు ఆనందంగా ఉండాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘ భవనంలో ఏర్పాటుచేసిన రైతు భరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయాల సేకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏయే పంటలు పండిస్తారని, పంటలు పండించే క్రమంలో ఎదురయ్యే సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. దేశానికి వెన్నముక రైతు అని.. ఆయన లేకుంటే వ్యవసాయమే లేదన్నారు. రైతుల నుంచి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే గ్రామాలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు రైతులకు అందాలన్న సదుద్దేశంతోనే ప్రత్యక్షంగా అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు చెప్పారు.

రైతుభరోసా అర్హులకు అందేలా చూడాలని.. ఎరువులు, విత్తనాలు, డ్రిప్, స్ప్రింకర్లను సబ్సిడీపై అందించాలని పలువురు రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. నవాబుపేట మండలాన్ని వెజిటెబుల్ జోన్‌గా ప్రకటించి పండించిన పంటలను మార్కెట్‌కు తరలించేందుకు వీలుగా రవాణా సౌకర్యాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పోలీసు రాంరెడ్డి, జిల్లా సహకార అధికారి ఈశ్వ రయ్య, తహసీల్దార్ జయరాం, ఎంపీడీవో అనురాధ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్పొరేటర్లలో కలహం

**రెండు వర్గాలుగా విడిపోయిన కార్పొరేటర్లు**

**ప్రస్తుత ఫ్లోర్ లీడర్‌ను తొలగించాలని హై కమాండ్‌కు ఫిర్యాదు**

**రేపో మాపో కొత్త లీడర్‌ను ఎన్నుకునేందుకు సమావేశం**

బడంగ్‌పేట, జూలై 2: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్యన వివాదం ముదిరింది. రెండు వర్గాలుగా విడిపోయారు. వారి మధ్యన విభేదాలు తారస్థాయికి చేరాయి. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 32 డివిజన్లు ఉన్నాయి. కార్పొరేషన్‌లో 14 మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్, 10 మంది కార్పొరేటర్లు బీజేపీ, ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా ఉన్నారు. ప్రస్తుతం మేయర్‌గా ఉన్న చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లో చేరారు. మేయర్‌తో పాటు రాళ్లగూడం సంతోషీశ్రీనివాస్‌రెడ్డి, పెద్ద బావి సుదర్శన్ రెడ్డిలు మేయర్‌తో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆ తర్వాత మేయర్, ఇద్దరు కార్పొరేటర్లతో కలిసి తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి పోయారు. ప్రస్తుతం, కాంగ్రెస్ పార్టీకి ఏడుగురు కార్పొరేటర్లు ఉన్నారు. కొంత కాలం నుంచి వీరి మధ్యన అంతర్గత విభేదాలు చోటు చేసుకున్నాయి. కార్పొరేటరు వంగేటి ప్రభాకర్ రెడ్డి, బండారు మనోహర్, ఎర్ర మహేశ్వరీజైహింద్, బాలూనాయక్, రాళ్లగూడెం సంతోషీశ్రీనివాస్‌రెడ్డిలు మేయర్ ఒంటెద్దు పోకడపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదులు చేశారు. అసెంబ్లీ ఎన్నికల నుంచే వీరి మధ్యన పచ్చగడ్డి వేస్తే భగ్గు మంటుంది. కొంత కాలం పాటు ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి కార్పొరేటర్లతో ఉంటూనే మేయర్‌కు అనుకూలంగా వ్యవహరించడం పట్ల నలుగురు కాంగ్రెస్ కార్పొరేటర్లు ఏకమై తిరుగు బావుటా ఎగురవేశారు. మేయర్‌కు సంబంధం లేకుండా వారే కాంగ్రెస్ పార్టీ మంత్రులను కల్వడం, నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా అధ్యక్షుల టచ్‌లోకి వెళ్లారు. ఇది గమనించిన మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి నలుగురు కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లను పక్కన పెట్టి బీజేపీ కార్పొరేటర్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇదే అంశాన్ని కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ దృష్టికి తీసుకుపోయారు.

ఐనా కూడా మేయర్, ఫ్లోర్ లీడర్‌లో మార్పు రాకపోవడంతో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డిని తొలగించి ఎర్ర మహేశ్వరీజైహింద్‌ను కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఎన్నుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఫ్లోర్ లీడర్‌గా ఎన్నుకొని బుధవారం బడంగ్‌పేట కమిషనర్‌కు లేఖ అందజేయనున్నట్లు తెలిసింది. మేయర్ తీరుపై కూడా గుర్రుగా ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్యన ఉన్న విభేదాలు మరోసారి బహిర్గతం అవుతున్నాయి. అధిష్ఠానం కూడా నలుగురు కార్పొరేటర్లకు మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. ఇక నుంచి వంగేటి ప్రభాకర్‌రెడ్డి కార్పొరేటర్‌గానే ఉంటారు తప్ప ఫ్లోర్ లీడర్‌గా తాము ఒప్పుకోవడం లేదని తీర్మానం చేసుకున్నట్లు తెలిసింది. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ కార్పొరేటర్లలో ముసలం మొదలైంది.

బొంరాస్‌పేటలోని హై స్కూల్ వదిలిన తర్వాత తుంకిమెంట్ల తదితర గ్రామాలకు కాలినడకన, ఆటోలో వెళ్తున్న విద్యార్థినీవిద్యార్థులు

- రంగారెడ్డి జిల్లాలోని చాలా గ్రామాలకు.. వికారాబాద్ జిల్లాలోని 96 పల్లెలకు బస్సు సౌకర్యం నిల్
- కిలోమీటర్ల మేర బడులకు నడిచి వెళ్లాల్సిందే..
- విద్యార్థులకు తప్పని అవస్థలు
- విధిలేక ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో..
- విద్యార్థుల భద్రతపై ఆందోళనలో తల్లిదండ్రులు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చాలావరకు ఆవాసాలు ఆర్టీసీ సేవలకు నోచుకోవడం లేదు. మున్సిపాలిటీలు, మండలాలు, మేజర్ పంచాయతీలు మినహా.. అనేక గ్రామాలు, హ్యాబిటేషన్లకు బస్సు సౌకర్యమే లేదు. ఫలితంగా బడులకెళ్లే విద్యార్థులు కిలోమీటర్ల మేర నడుచుకుంటూ స్కూళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులను వేడుకున్నా.. ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టినా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే చాలామంది విద్యార్థులు నడుచుకుంటూ బడులకు వెళ్తుండగా, మరికొందరు ఆటోలాంటి ప్రైవేట్ వాహనాల ను ఆశ్రయిస్తున్నారు. వాటిలో ఉదయం, సాయంత్రం సమయాల్లో వెళ్లవచ్చినందు కు ప్రతి విద్యార్థికి ప్రతినెలా కనీసం రూ. వెయ్యి వరకు ఖర్చు అవుతుండడం పేద కుటుంబాలకు భారంగా మారింది. అయితే కొన్ని గ్రామాలకొక బస్సు ఉండడం కూ డా విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. రూట్‌కు ఒక్క బస్సు మాత్రమే ఉండడంతో అందులో నిలబడేందుకు కూడా స్థలంలేక పుట్‌బోర్డు ప్రయాణం చేయాల్సిన దుస్థి తి నెలకొన్నది. కాగా వికారాబాద్ జిల్లాలోని 96 గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యమేలేదు.

-వికారాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ)

# నడక యాతనే..

## బస్సులు లేక కాలినడకనే పాఠశాలలకెళ్తున్న విద్యార్థులు

**రంగారెడ్డి జిల్లాలో పలుచోట్ల ఇదీ పరిస్థితి..**

- షాబాద్‌కు నిత్యం కుమ్మరిగూడ గ్రామం నుంచి యాభై మంది విద్యార్థులు స్కూ ళ్లు, కాలేజీల కోసం వెళ్తుంటారు. బస్సు సౌకర్యం లేక కాలినడకనే వెళ్తున్నారు.
- షాబాద్ మండలంలోని వెంకమ్మగూడ, లక్ష్మరావుగూడ గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.
- మొయినాబాద్ మండలంలోని బాకారం మండల కేంద్రానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు నడుచుకుంటూ.. మరికొందరు ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్నారు.
- షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో మొత్తం 86 బస్సులుండగా.. సరిపడా బస్సుల్లేవు. ముఖ్యంగా ఆమనగల్లు, నవాబుపేట, షాబాద్‌కు వెళ్లే మార్గాల్లో బస్సుల కొరతతో విద్యార్థులకు అవస్థగా మారింది.
- ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో పరిధిలోని యాచారం మండలంలోని చాలా గ్రామాలకు సకాలంలో బస్సులు రావడం లేదు. నానక్‌నగర్, మల్కీజ్‌గూడ, కడ్తాల్ మండలంలోని పల్లెచెల్కతండాకు చెందిన విద్యార్థులు నిత్యం నడుచుకుంటూనే మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్తున్నారు.
- మంచాల మండలంలోని కుర్మిద్ద, మర్లకుంటతండా, మంగలిగడ్డ తండాలకు చెందిన విద్యార్థులు సైతం కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట పాఠశాలకు ఎక్కువగా కాలినడకనే వెళ్తున్నారు. ఇంకా చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉన్నది. చదువుకునేందుకు నడుచుకుంటూ వెళ్లాల్సిందే.

రంగారెడ్డి జిల్లాలో నేటికీ చాలా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యమే లేదు.. వికారాబాద్ జిల్లాలోని 96 గ్రామాలకు బస్సులే వెళ్లడం లేదు. దీంతో విద్యార్థులు చదువుకునేందుకు 5-6 కిలోమీటర్ల దూరంలో ఉన్న బడులకు కాలినడకనే వెళ్తున్నారు. కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం ఉన్నా పాఠశాలల వేళల్లో లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సిందే. ఇందుకుగాను ప్రతి విద్యార్థి ప్రతినెలా కనీసం రూ. వెయ్యి వరకు వెచ్చిస్తున్నారు. బస్ పాస్‌లు ఉన్నా నామమాత్రంగానే మిగులుతున్నాయి. మారుమూల ఆవాసాలకు ఆర్టీసీ అధికారులు బస్సులను తగ్గించారు. దీంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు సరిపడా బస్సులు ఉండడంలేదు. బస్సుల్లేక ప్రైవేట్ వాహనాల్లో బడులకెళ్లిన విద్యార్థులు ఇంటికొచ్చేవరకు తల్లిదండ్రులు ఆందోళనతో గడపాల్సి వస్తున్నది.

దోమ మండల పరిధిలోని దోర్నాల్‌పల్లి పాఠశాల నుంచి..

### బస్సు సౌకర్యం కల్పించండి మహాప్రభో..

మా స్వగ్రామం గంజిపల్లి. నేను పరిగి పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్నా. మా గ్రామానికి బస్సు సౌకర్యం లేక 30 మందిమి ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న గడిసింగాపూర్, రంగారెడ్డిపల్లి ప్రధాన రహదారికి నడుచుకుంటూ వెళ్లి అక్కడ బస్సు ఎక్కి పరిగి పట్టణానికి వెళ్లాలి. తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తాం. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యాన్ని కల్పించాలి.

– జే ప్రవీణ్‌కుమార్, గంజిపల్లి, దోమ,వికారాబాద్ జిల్లా

### పర్వేదకు నడిచి వెళ్లాల్సిందే..

మాది సంకేపల్లి. మా ఊరి నుంచి పర్వేద గ్రామంలో ఉన్న జడ్పీహెచ్ఎస్ వరకు సుమారు పది కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో నడుచుకుంటూ వెళ్లి రావాల్సిందే. వర్షాలు పడితే బడికి వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులను నడపాలి.

– కీర్తన, టెన్త్ క్లాస్, సంకేపల్లి, శంకర్‌పల్లి, రంగారెడ్డి జిల్లా

**వికారాబాద్ జిల్లాలోని 96 గ్రామాలకు బస్సు సౌకర్యమే లేదు..**

వికారాబాద్ జిల్లాలోని 96 గ్రామాలకు బస్సు సౌకర్యమే లేదు. పరిగి సెగ్మెంట్ పరిధి ..పరిగి మండలంలోని బర్కత్‌పల్లి, రుక్కుంపల్లి, యాబాజిగూడ, నారాయణపూర్, లక్ష్మీదేవిపల్లి, రంగంపల్లి, రూప్‌ఖాన్‌పేట, బసిరెడ్డిపల్లి.. దోమ మండలంలోని గంజిపల్లి, గుండాలతండా, లింగంపల్లి, బట్లచందరం, ఖమ్మంనాచారం, పోతిరెడ్డిపల్లి, శివారెడ్డిపల్లి, బొంపల్లి పెద్ద తండా, మైలారం, మైలారంతండా.. కులకచర్ల మండలంలోని ఘనాపూర్, సాల్వేడ్, చెల్లాపూర్, అనంతసాగర్.. పూడూరు మండలంలోని కండ్లపల్లి, మీర్జాపూర్, ఎన్కెపల్లి, గొంగుపల్లి, తిర్మలాపూర్, కెరవెళ్లి గ్రామాలకు ఇప్పటికీ బస్సు సౌకర్యమే లేదు. అదేవిధంగా వికారాబాద్ సెగ్మెంట్..వికారాబాద్ మండలంలోని ఎర్రవల్లి, పుల్‌మద్ది, కామారెడ్డిగూడ, పులుసుమామిడి, పీరంపల్లి, ద్యాచారం, ఐనాపూర్, సర్పన్‌పల్లి, కోటాలగూడ, నారాయణపూర్, పెండ్లిమడుగు.. నవాబుపేట మండలంలోని చిట్టిగిద్ద, దాతాపూర్, కేశవపల్లి, మూలమాడ, కరీంగూడ, అర్కతల, నాగిరెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, మాదారం గ్రామాలకు..ధారూరు మండలంలోని నాగ్‌సాన్‌పల్లి, కుమ్మరిపల్లి, ఎబ్బనూరు, ధర్మపూర్, కొండాపూర్ కుర్దు, అల్లీపూర్, నర్సాపూ ర్, కుక్కింద, అవుసుపల్లి, దోర్నాలతండా.. మర్పల్లి మండలంలోని కోట్‌మర్పల్లి, షాపూర్, తిమ్మాపూర్, రావులపల్లి, నర్సాపూర్, పిల్లిగిండ్ల, దార్గులపల్లి, రాంపూర్, కొంపెట్టిపల్లి గ్రామాలకు.. కొడంగల్ సెగ్మెంట్, దౌల్తాబాద్ మండలంలోని లొట్టిగుంట తండా, ర్యాలగుట్ట తండా, ఊరకుంటతండా..బొంరాస్‌పేట మండలంలోని లింగంపల్లి, ఎన్కెపల్లి , కొడంగల్ మండలంలోని చిన్ననందిగామ, ప్యాలమద్ది, పాతకొడంగల్, ఇందనూ రు, పడుగురాళ్లతండా, బోనమ్మ తండా తాండూరు సెగ్మెంట్‌లోని ఖాంజాపూర్, వీరారెడ్డిపల్లి, గోనూర్, సిరిగిరిపేట్, అన్నసాగర్, బండమీదిపల్లి, రేలగడ్డతండా, విశ్వనాథపూర్, బమ్లానాయక్‌తండా, కంసాన్‌పల్లి, దుగ్గాపూర్, ఖానాపూర్, చైతన్యనగర్ గ్రామాలకు పల్లె వెలుగు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

అంతప్పగూడ పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

### సకాలంలో బడికి వెళ్లలేకపోతున్నాం.

మా ఊరు మల్కీజ్‌గూడ.. అక్కడి నుంచి మేడిపల్లికి వెళ్లేందుకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది. మేడిపల్లిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రతిరోజూ నాతోపాటు చాలా మంది విద్యార్థులం కాలినడకనే పాఠశాలకు వెళ్లి వస్తూ అలసిపోతున్నాం. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత హోంవర్క్ సరిగ్గా చేయలేకపోతున్నాం. వర్షం పడితే పాఠశాలకు డుమ్మానే. సకాలంలో బడికి వెళ్లలేక చదువులో వెనుకబడిపోతున్నాం. ప్రభుత్వం స్పందించి ఉదయం, సాయంత్రం పాఠశాలల సమయాల్లో ఆర్టీసీ బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలి.

అర్చన, తొమ్మిదోతరగతి విద్యార్థిని, మల్కీజ్‌గూడ

### నడిచి..నడిచి అలసిపోతున్నాం..

గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అగ్గనూరులోని జడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్నాం. నిత్యం ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న జాతీయ రహదారి వరకు నడుచుకుంటూ వెళ్లి.. అక్కడ ఆర్టీసీ బస్సు ఎక్కి లక్ష్మీనారాయణపురం స్టేజీ వద్ద దిగుతాం. అక్కడి నుంచి మళ్లీ నడిచి అగ్గనూరులోని జడ్పీ హెచ్ఎస్‌కు చేరుకుంటాం. దీంతో ప్రతిరోజూ పది కిలోమీటర్లకుపైగా నడవాల్సి రావడంతో తొందరగా అలసిపోతున్నాం. ఇంటికి వచ్చాక చదివే ఓపిక ఉండడం లేదు. ప్రభుత్వం స్పందించి విద్యార్థుల కష్టాలు తీర్చేందుకు ఆర్టీసీ బస్సులను గ్రామీణ ప్రాంతాల్లో నడపాలి.

– వంశీకృష్ణ, తిమ్మాయిపల్లి/వినయ్ కుమార్, బండమీదిపల్లి, యాలాల

## పాడైన రొయ్యలు

**కిచెన్‌లో బొద్దింకలు**

**ఫుడ్‌సేఫ్టీ విభాగం తనిఖీల్లో వెలుగు చూసిన నిజాలు**

సిటీబ్యూరో, జూలై 2 (నమస్తే తెలంగాణ): పేరుకే పెద్ద పెద్ద రెస్టారెంట్లు. వంద ల కొద్దీ బెస్ట్ రివ్యూలతో మంచి పేరు పొందుతాయి. కానీ అసలు విషయమంతా కిచెన్ రూంలోకి వెళ్లి చూస్తే మేడిపండు మేలిమి రహస్యాలన్నీ బయటపడతాయి. ఫుడ్‌సేఫ్టీ విభాగం నిర్వహిస్తున్న తనిఖీల్లో ఆయా రెస్టారెంట్ల చేదు విషయాలన్నీ వెల్లడవుతున్నాయి. మంగళవారం అధికారులు నానక్‌రాం గూడ తబలా రసా లో 12 కిలోల రొయ్యలు, పాల గడువు ముగిసి ఉన్నాయని గుర్తించారు.

అయినా సిబ్బంది వాటిని వినియోగదారులకు విక్రయిస్తున్నారని తేలింది. వంటగది అపరిశుభ్రంగా ఉన్నట్లు, నిల్వ చేసిన ఆహార వస్తువులకు సరైన కవర్లు లేవన్న విషయాన్ని గుర్తించారు. ఈ తనిఖీల్లో భాగంగా గచ్చిబౌలిలోని హకునా మరాతా కిచెన్‌లో ఫుడ్ హ్యాండ్లర్లు తలపాగా, గ్లౌజులు, అప్రాన్ ధరించకుండా ఉన్నట్లు గుర్తించారు. బొద్దింకల నియంత్రణ కూడా లేదు. కాగా సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు పేర్కొన్నారు.

## 6 రోజులకొకసారి ఫాగింగ్ చేయండి

సిటీబ్యూరో, జూలై 2 (నమస్తే తెలంగాణ): నగరవ్యాప్తంగా డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రవికిరణ్ మంగళవారం ఎంటమాలజీ చీఫ్ రాంబాబు, ఇతర అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రతి ఆరు రోజులకొకసారి తప్పనిసరిగా ఫాగింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో లాగ్‌బుక్స్, రికార్డులు సరిగ్గా ఉండేటట్లు చూసుకోవాలని చెప్పారు. డెంగీ కేసులు నమోదవుతున్న ప్రాంతాలు, హాట్ స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టి ఫాగింగ్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. 4846 కాలనీలలో దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

## జలమండలిలో ఒకే చోట తిష్ట వేసిన ఉద్యోగులకు స్థానచలనం

**ఆదేశాలు జారీ చేసిన డైరెక్టర్**

సిటీబ్యూరో, జూలై 2 (నమస్తే తెలంగాణ) : ఒకే చోట పాతుకుపోయిన ఉద్యోగులను ఇతర చోట్లకు బదిలీలు చేయాలని జలమండలి నిర్ణయించింది. ఈ మేరకు పది సంవత్సరాల నుండి ఒకే చోట పనిచేస్తున్న జీపీఈ (జనరల్ పర్పస్ ఎంప్లాయి) ఎస్‌పీఈ (స్పెషల్ పర్పస్ ఎంప్లాయి)లను తొలుత బదిలీలు జరపాలని డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్ ఆయా డివిజన్ల జీఎంలకు ఆదేశాలు జారీ చేశారు. ఒకే చోట పదేళ్లుగా కొనసాగుతున్న లైన్‌మన్లను కచ్చితంగా మార్చాలని, ఈ బాధ్యత జీఎంలదే అని ఆదేశించారు. కాగా ఈ బదిలీలపై వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్(బీఆర్‌టీయూ) నిరసన వ్యక్తం చేసింది. అవినీతి అధికారులను వదిలేసి చిన్న ఉద్యోగులపై ప్రతాపం చూపడం తగదని బీఆర్‌టీయూ అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్ ప్రశ్నించారు. జలమండలిలో పాలన అస్తవ్యస్థంగా తయారైందని, జీఎం, డీజీఎంలను బదిలీలు చేసిన తర్వాతనే కింది స్థాయి ఉద్యోగులను బదిలీ చేయాలని రాంబాబు యాదవ్ చెప్పారు. ఐదేళ్లకు పైబడిన డీజీఎం, మేనేజర్లను బదిలీ చేయాలని గత నెల 19న సర్క్యులర్ జారీ చేసి ఇప్పటి వరకు బదిలీలు చేయడం లేదని ఉద్యోగ సంఘాల నేతలు ఆరోపించారు. డీజీఎంలు 25 నుంచి 30 మంది, మేనేజర్ 50 నుంచి 70 మంది వరకు ఉంటారని, వీరిని బదిలీ చేయడం లేదని యూనియన్ సభ్యులు మండిపడుతున్నారు.